క్లుప్తంగా

మెరుగైన వైద్యసేవలందించాలి

కోవూరు : ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని టీసీహెచ్ ఎస్ రమేష్‌నాథ్ అన్నారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు రోగులు ఎంతో నమ్మకంతో వస్తారని, ఆ మేరకు వారికి వైద్యసేవలు అందించాలన్నారు. రోగులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తే ఎంతో సంతృప్తిగా ఉంటుందన్నారు. త్వరలో ఇక్కడ నూతన భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదన పంపుతామన్నారు. డాక్టర్లు భోజన సమయంలో విడతల వారీగా వెళ్లాలని సూచించారు. అనంతరం రోగులతో వైద్యసేవలపై ఆరాతీశారు. ఆయన వెంట సూపరింటెండెంట్ వెంకటచలపతి గౌడ్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

కేన్సర్‌పై అవగాహన తప్పనిసరి



నెల్లూరు(అర్బన్) : గర్భాశయ ముఖద్వారపు(సర్వికల్) కేన్సర్‌పై తప్పనిసరిగా అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి అన్నారు. స్థానిక పొదలకూరు రోడ్డులోని కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళలకు ఉచిత సర్వికల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ స్త్రీలలో వచ్చే కేన్సర్లలో గర్భసంచి ముఖద్వారపు కేన్సర్ రెండో స్థానంలో ఉండడం బాధాకరమన్నారు. దీనిపై తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, రేడియేషన్ అంకాలజిస్ట్ గీతాఉషశ్రీ, సర్జికల్ అంకాలజిస్ట్ ముత్తు, పెథాలజిస్ట్ నందిత, జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి, పేషంట్ కౌన్సిలర్ కన్యాకుమారి, ఎంసీ మెంబర్ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చిత్రకళను ప్రోత్సహించాలి

నెల్లూరు(బృందావనం) : భారతీయ చిత్రకళను సమాజం ప్రోత్సహించాలని 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అన్నారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఏర్పాటు చేసిన 'కలర్స్ ఆఫ్ నెల్లూరు ఎడిషన్ 3 ఆర్ట్ ఎగ్జిబిషన్'ను శనివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ ప్రదర్శనను నెల్లూరీయులు తిలకించి ఆదరించాలన్నారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు తాళ్లపాక రమేష్‌రెడ్డి విచ్చేసి చిత్రకారులు అమీర్‌జాన్, ఎం.సుందరబాబు, బి.శేషయ్యలు తీర్చిదిద్దిన 30 ఎన్టీఆర్ చిత్రాలను వీక్షించి అభినందించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పవన్‌రెడ్డి, అందె శ్రీనివాసులు, కేఎస్ నరసయ్య, దోర్నాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో ఆరాధనోత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు త్యాగరాజస్వామికి అభిషేకం, నామార్చనలు జరిపారు. అనంతరం భక్తబృందంచే భిక్షాటన, నగర సంకీర్తన చేపట్టారు. బ్రహ్మశ్రీ మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కార్యక్రమాన్ని త్యాగరాజ సేవా సమితి నిర్వాహకులు పర్యవేక్షించారు.

కొనలేం.. తినలేం

- తారాస్థాయికి ఎగబాకుతున్న కూరగాయల ధరలు
- ప్రజల బెంబేలు

వెంకటాచలం: గ్రామాల్లో కూలీలకు ప్రస్తుతం ఎలాంటి పనుల్లేకపోవడం.. ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందకపోవడంతో పూట గడుపుకొనేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్యులు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఎగబాకుతున్న ధరలు

మండలంలోని అన్ని దుకాణాల్లో కూరగాయల ధరలు పది రోజులుగా ఎగబాకుతున్నాయి. ఫలితంగా వీటిని కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. బీరకాయ, వంకాయల కిలో రూ.40 నుంచి రూ.60.. బెండకాయలు కిలో రూ.40 నుంచి రూ.55.. పందిరి చిక్కుడు కిలో రూ.90 నుంచి రూ.120.. బీన్స్ కిలో రూ.60 నుంచి రూ.80.. గోరుచిక్కుడు కిలో రూ.50 నుంచి రూ.70.. పచ్చిమిర్చి కిలో రూ.40 నుంచి రూ.70.. ఉల్లిపాయల కిలో రూ. 35 నుంచి రూ.70 లెక్కన వాటి నాణ్యత బట్టి దుకాణాల్లో విక్రయిస్తున్నారు. టమోటా కిలో రూ.15 నుంచి రూ.30కు విక్రయిస్తుండటంతో సామాన్యులకు అందుబాటులో ఉంది. ప్రభుత్వం స్పందించి వీటి ధరలను నియంత్రించేలా చూడాలని కోరుతున్నారు.

కుటుంబపోషణ భారం

మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 60 వేల మందికిపైగా నివసిస్తున్నారు. 70 శాతానికిపైగా ప్రజలు నిత్యం ఏదో పనికి వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరింది. అమ్మఒడి, రైతు భరోసా, నేతన్న నేస్తం, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలను గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేయడంతో ఎలాంటి ఆర్థిక ఇబ్బందుల్లేకుండా ప్రజలు జీవిస్తూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు అందించే సంక్షేమ పథకాల అమలును విస్మరించింది. ఫలితంగా ప్రజల జీవనం కష్టంగా మారింది. గత నెల వరకు గ్రామాల్లో కూలీలకు వరినాట్లు, కలుపుతీత వంటి పనులు ఉండటంతో కుటుంబ పోషణను నెట్టుకొచ్చారు. ప్రస్తుతం గ్రామాల్లో కూలీలకు ఎలాంటి పనుల్లేకపోవడం, దీనికి తోడు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో పూట గడిచేది ఎలాగని ప్రశ్నిస్తున్నారు.



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

బిల్లుల మంజూరులో పక్షపాతం వద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

కొడవలూరు : బిల్లుల మంజూరులో అధికారులు పక్షపాతం చూపవద్దని ఎంపీపీ గాలి జ్యోతి విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిల్లుల మంజూరులో రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. అధికార యంత్రాంగం రాజకీయాలకతీతంగా వ్యవహరిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను తెలుసుకునే కీలకమైన సమావేశానికి అధికారులు డుమ్మా కొడితే విశ్వసనీయత తగ్గుతుందన్నారు. యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి కామాక్షయ్య మాట్లాడుతూ హెచ్‌ఎంపీ వైరస్ వల్ల భయపడాల్సిన అవసరం లేదని, ఇది కేవలం జలుబు, దగ్గు లాంటిదేనన్నారు. హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా మాట్లాడుతూ గత ఐదేళ్లలో పక్కా గృహాలు మంజూరు చేసి వివిధ దశల్లో నిలిచిపోయి ఉన్న నిర్మాణాలకు కొత్తగా వచ్చే గృహ నిర్మాణ పథకం వర్తించదన్నారు. వెంటనే అర్థాంతరంగా నిలిచి ఉన్న గృహాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మారంరెడ్డి సుజాత, ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య, ఏఓ లక్ష్మి, ఏపీఎం జి.కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పద్మావతి, నిర్మల, నాగభూషణమ్మలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.
తమ కుటుంబ సభ్యులను ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించుకున్నారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో కొలువైన లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పల్లకిసేవను నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ



బుచ్చిరెడ్డిపాళెం : ఫిబ్రవరిలో నెల్లూరు నగరంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోండి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఆనంద్

- కలెక్టర్ ఆనంద్

ముత్తుకూరు: ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిడతాపోలూరులో శనివారం పర్యటించిన ఆయన గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇంకుడు గుంత నిర్మాణానికి రూ.ఆరు వేలవుతుందని, ఉపాధి హామీ పథకం ద్వారా వీటిని నిర్మించుకోవచ్చని చెప్పారు. అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ప్రతి మూడో శనివారం నిర్వహించాలని సూచించారు. అన్ని గ్రామాల ప్రజలకు ఫిబ్రవరి మూడు నాటికి అవగాహన కల్పించి, ఇంకుడు గుంతలను నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గిడ్డంగి అవసరమని గ్రామస్తులు తెలిపారు. డీపీఓ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ నాగమణి, సర్పంచ్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



బుచ్చిరెడ్డిపాళెం : వైఎస్సార్‌సీపీ బుచ్చి పట్టణాధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డితో పాటు రూరల్ అధ్యక్షుడిగా నియమితులైన చెర్లో సతీష్‌రెడ్డిని పార్టీ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పార్టీ కార్యాలయంలో ఈ మేరకు కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ నేతలు పిడుగు మధు, తిరుమలేష్, ఉప్పులూరి హరికృష్ణ, దాచూరి ప్రభాకర్ ఉన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



మనుబోలు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నేతలు గాలి రామకృష్ణారెడ్డి, వెందోటి భాస్కర్‌రెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, మురళీనాయుడు, రామిరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి పశువైద్య శిబిరాలు



పోస్టర్లను ఆవిష్కరించిన ఏడీ మురళీకృష్ణ

ఇందుకూరుపేట : ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాల్లో పశువులకు చికిత్సలు, మందుల పంపిణీ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మైపాడులో ఎడ్ల బండలాగుడు పోటీలు



ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో ఎడ్ల బండలాగుడు పోటీలను శనివారం నిర్వహించారు. గ్రామంలో ఢిల్లీపోలక్ష్మమ్మ జాతర సందర్భంగా ఈ పోటీలను ఏర్పాటు చేశారు. తొలుత అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ పోటీలను ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డిలు ప్రారంభించారు. జాతర సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

ఘనంగా గొబ్బెమ్మల గ్రామోత్సవం



మనుబోలు: గొబ్బెమ్మల గ్రామోత్సవాన్ని మనుబోలులో శనివారం నిర్వహించారు. చంద్రమౌళీనగర్‌లోని గొబ్బెమ్మ చావిడి వద్ద గొబ్బెమ్మను ఉంచి పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం గొబ్బెమ్మలను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఉత్సవాన్ని జరిపారు. అనంతరం కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం



బుచ్చిరెడ్డిపాళెంలో అవగాహన ర్యాలీ

ముత్తుకూరు: స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రపర్చి ర్యాలీలను జరిపారు.

- పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా వ్యవహరించాలని పంటపాళెం పంచాయతీ కార్యదర్శి చలపతి పేర్కొన్నారు. ఆశవర్కర్లు, పంచాయతీ సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులతో ర్యాలీని నిర్వహించారు. స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కృష్ణపట్నం పోర్టు పోలీస్‌స్టేషన్లో పరిసరాలను పరిశుభ్రం చేశారు. గదులను ఎస్సై శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శుభ్రపర్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించనున్నామని ఎస్సై చెప్పారు.

పొదలకూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ఎస్సై హనీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ప్రతి మూడో శనివారం నిర్వహించనున్నామని చెప్పారు.

మనుబోలు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ జలజాక్షి పేర్కొన్నారు. మనుబోలులో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ ర్యాలీని సర్పంచ్ కంచి పద్మమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి గరుడయ్య, ఏపీఓ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

- విడవలూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పి.నరేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలను కూడా శుభ్రం చేసుకోవడాన్ని అలవరుచుకోవాలన్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలను సిబ్బందితో కలిసి ఆయన శుభ్రం చేశారు.
- బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని నగర పంచాయతీతో పాటు మరికొన్ని పంచాయతీల్లో స్వచ్ఛాంధ్ర ర్యాలీలు బుధవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, మెప్మా అధికారులు, సిబ్బందితో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అదేవిధంగా రేబాలలో సర్పంచ్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది.
- బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం జరిగింది. ఎస్సై సంతోష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.
- ఇందుకూరుపేట : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని డేవిస్‌పేటలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో ఎంపీ వేమిరెడ్డి పాల్గొని, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతను అలవాటుగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : చెత్తను తొలగిస్తున్న ఎంపీ వేమిరెడ్డి



పొదలకూరులో..



మనుబోలులో..



విడవలూరు : పోలీస్‌స్టేషన్ ఆవరణలో..



బుచ్చిరెడ్డిపాళెం : రేబాలలో..



ముత్తుకూరు: పంటపాళెంలో ర్యాలీ

ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత

కొడవలూరు : ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి అన్నారు. మండలంలోని పలువురు స్థానిక సంస్థల ప్రతినిధులు, నాయకులను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలను గుప్పించి ప్రజలను నిలువునా ముంచిందని విమర్శించారు. ఆయన కలిసిన వారిలో సర్పంచ్‌లు మోర్ల రమేష్, మారంరెడ్డి రంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కామేశ్వరి, ఉప సర్పంచ్ బాలచంద్రారెడ్డి, నాయకులు నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, కాకి సుమన్, కారెంపూడి సుబ్బరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డిలు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు కొట్టే మల్లికార్జున, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు 124 మంది హాజరు



ముత్తుకూరు: ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించిన నవోదయ స్కూల్ పరీక్షను స్థానిక ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించారు. 192 మందికి గానూ 124 మంది హాజరయ్యారు. హెచ్‌ఎం చల్లా శ్రీనివాసులురెడ్డి, ఎంఈఓ హేమసుందర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ పర్యవేక్షించారు.

వెంకయ్య మరణం తీరనిలోటు

బుచ్చిరెడ్డిపాళెం : జిల్లా ఉద్యమాల్లో రచయితగా, గాయకుడిగా సేవలందించిన కళాకారుడు గోవిందు వెంకయ్య మరణం తీరనిలోటు అని ప్రజానాట్యమండలి సీనియర్ నేత పి.విజయకుమార్ శనివారం అన్నారు. సీపీఎం పార్టీకి, ప్రజానాట్యమండలికి వారి ఆశయాలను కొనసాగిస్తామన్నారు.